# నాగారం అభివృద్ధిపై చర్చకు సిద్ధమా..?



నాగారం మున్సిపాలిటీలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి, బీఆర్ఎస్ నేతలు

- ప్రతిపక్షాలకు చైర్మన్ చంద్రారెడ్డి సవాల్
- మున్సిపాలిటీ అభివృద్ధికి మంత్రి మల్లారెడ్డి కోట్ల రూపాయలు కేటాయించారు...
- ఎంపీగా ఉన్న రేవంత్‌రెడ్డి ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు
- పార్టీలకతీతంగా నాగారాన్ని అభివృద్ధి చేశాం
- ఓర్వలేకనే ప్రతిపక్షాల ఆరోపణలు
- మంత్రిపై ఆరోపణలు చేస్తే కబడ్దార్

**మేడ్చల్ కలెక్టరేట్, అక్టోబర్ 10:** నాగారం అభివృద్ధికి మంత్రి మల్లారెడ్డి కోట్ల రూపాయలు కేటాయించారని, ప్రతిపక్షాలు అభివృద్ధిని చూసి ఓర్వలేక అరోపణలు చేస్తున్నారని మున్సిపాలిటీ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలో బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు తేళ్ల శ్రీధర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చైర్మన్ మాట్లాడుతూ గ్రేటర్ హైదరాబాద్‌కు ఆనుకుని ఉన్న నాగారం మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశామన్నారు. పార్టీలకతీతంగా బీజేపీ, కాంగ్రెస్ పార్టీల కౌన్సిలర్ల ఉన్న వార్డులకు అధిక నిధులు మంజూరు చేసి అభివృద్ధి చేశామని చెప్పారు. మన ప్రాంతానికి ఎంపీగా ఉన్న రేవంత్ రెడ్డి ఇంత వరకు ఒక్క రూపాయి కూడా నిధులు కేటాయించలేదని, కాంగ్రెస్ నేతలు ఎంపీ నిధులు తెచ్చి అభివృద్ధిపై మాట్లాడాలని సూచించారు. మంత్రి మల్లారెడ్డి రూ. 8 కోట్ల హెచ్ఎండీఏ నిధులతో పాటు, 20 వార్డులకు రూ.10 లక్షల చొప్పున రూ. 2 కోట్లు, 16వ వార్డుకు రూ.15 లక్షలు మంజూరు చేసి పనులు పూర్తి చేశారన్నారు. లింక్ రోడ్లకు ప్రభుత్వం రూ. 209 కోట్ల కేటాయించిందని, ఎన్నికల అనంతరం పనులు ప్రారంభిస్తామని తులిపారు. ప్రతిపక్షాలు మంత్రిపై ఆరోపణలు చేస్తే కబడ్దార్ అని ఆయన హెచ్చరించారు.

నాగారం మున్సిపాలిటీలో అభివృద్ధి చర్చకు సిద్ధమా అని చైర్మన్ ప్రతిపక్షాలకు సవాల్ విసిరారు. ఆరు గ్యారెంటీ పథకాలు అని చెపుతున్న కాంగ్రెస్ కర్నాటక ఎన్నికల్లో ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయడం లేదని విమర్శించారు. అనంతరం పార్టీ అధ్యక్షులు తేళ్ల శ్రీధర్ మాట్లాడుతూ మూడోసారి బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వస్తుందని, మళ్లీ కేసీఆరే సీఎం అవుతారని ధీమా వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం విభజన హామీలు ఇంత వరకు నెరవేర్చలేదని అన్నారు. మంత్రి మల్లారెడ్డిని అధిక మెజార్టీతో గెలిపిస్తామని అన్నారు.

### స్థానికులకు 10 శాతం డబుల్ ఇండ్లు ఇస్తాం..

నాగారం మున్సిపాలిటీ రాంపల్లిలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు 10శాతం స్థానికులుకు ఇస్తామని చైర్మన్ చంద్రారెడ్డి హామీ ఇచ్చారు. నాగారం, రాంపల్లిలో నివాసం ఉండే ఇండ్లు లేని నిరుపేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను పంపిణీ చేస్తామని చైర్మన్ చెప్పారు.ఈ కార్యక్రమంలో పార్టీ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్, కౌన్సిలర్లు దివ్య, అనంత్ రెడి, శ్రీనివాస్ గౌడ్, నాగేశ్ గౌడ్,నాయకులు శ్రీనివాస్, ఎల్లమయ్య, రాములు, అంజయ్యగౌడ్,కృష్ణారెడ్డి,సాయినాథ్ గౌడ్, సుధాకర్‌రెడ్డి, పెట్టయ్య గౌడ్, రమేశ్ గుప్తా, మహేందర్ రెడ్డి, సురేశ్, జగన్‌మోహన్‌రెడ్డి, నరేందర్ రెడి,షఫి,అశోక్, నర్సింహారెడ్డి, వామన్, ఖాజాబాషా, పర్వేజ్,తదితరులు పాల్గొన్నారు.

## బతుకమ్మ సంబురాలకు
# గురుకుల్ మైదానంలో ఏర్పాట్లు



మైదానంలో డోజర్‌తో చదును చేస్తున్న దృశ్యం

**ఘట్‌కేసర్,అక్టోబర్10:** ఘట్‌కేసర్‌లోని గురుకుల్ మైదానాన్ని బతుకమ్మ సంబరాలకు సిద్ధం చేస్తున్నారు. జన చైతన్య సేవా సమితి ప్రధాన కార్యదర్శి ఎస్.శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో యువజన సంఘాల ప్రతినిధులు పలువురు పాల్గొని ఈ పనులను నిర్వహిస్తున్నారు. జేసీబీతో గురుకుల్ మైదానాన్ని పూర్తిగా చదును చేయిస్తున్నారు.బతుకమ్మ సంబురాలు, దసరా,రావణ దహణం,దుర్గామాత నవరాత్రి ఉత్సవాలను ఈ మైదానంలో నిర్వహిస్తారు.

# నైపుణ్యాల పెంపునకు వర్క్‌షాప్‌లు దోహదం



ఫొటోగ్రఫీ శిక్షకుడు వీరేంద్రసింగ్‌ను సన్మానిస్తున్న కార్యదర్శి టీవీరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీలత

**మేడ్చల్, అక్టోబర్ 10:** నైపుణ్యాల పెంపునకు వర్క్‌షాప్‌లు దోహదం చేస్తాయని గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడలోని సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాల కార్యదర్శి టీవీ రెడ్డి అన్నారు. కళాశాలలో మంగళవారం ఫొటోగ్రఫీ వర్క్‌షాప్ 3.0ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు ఆసక్తి ఉన్న రంగంపై దృష్టి సారించాలన్నారు. తమలో అంతర్గతంగా నైపుణ్యాలకు పదును పెడుతూ భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలు అధిరోహించడమే కాకుండా సమాజంలో ప్రత్యేక గుర్తింపు లభిస్తుందని తెలిపారు. వర్క్‌షాప్‌లను వినియోగించుకొని, నైపుణ్యాలను పెంపొందించుకోవాలని ఆయన సూచించారు. ఫొటోగ్రఫీ శిక్షకుడు వీరేంద్ర సింగ్ విద్యార్థులు ఫొటోగ్రఫీపై శిక్షణనిచ్చాడు.కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీలత, డైరెక్టర్‌లు సరోజారెడ్డి, అనురాగ్ రెడ్డి, పీఆర్వో రవి సుధాకర్, ఏవో డాక్టర్ హరిప్రసాద్ రెడ్డి, హెచ్‌వోడీలు,అధ్యాపకులు,విద్యార్థులు ఉన్నారు.

# వినూత్న ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలి

**ఘట్‌కేసర్ రూరల్, అక్టోబర్ 10:** ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్ టెక్నాలజీనని ఫార్మాలజీకి అనుసంధానం చేయడం ద్వారా వినూత్న ఆవిష్కరణలకు తోడ్పతుందని ఇండియన్ ఫార్మాకాలజీ సొసైటీ ప్రధాన కార్యదర్శి కళా కుమార్ తెలిపారు. మండల పరిధి వెంకటాపూర్‌లోని అనురాగ్ యూనివర్శిటీ స్కూల్ ఆఫ్ ఫార్మసీ, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫార్మాకాలజీ ఆధ్వర్యంలో ఇన్నోవేటివ్ ఆప్రోచెస్ ఇన్ డ్రగ్ డిస్కవరి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అనే అంశంపై నిర్వహిస్తున్న ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌ను మంగళవారం ఆయన ప్రారంభించారు. హెల్త్‌కేర్ రంగంలో వస్తున్న వినూత్న మార్పులకు అనుగుణంగా రీసెర్చ్ జరగాలని సూచించారు. డ్రగ్ రెసిస్టెన్స్ వంటి సవాళ్లను కృత్రిమ మేధస్సు సహకారంతో ఎదుర్కోవాలని పేర్కొన్నారు.డ్రగ్ డిస్కవరీ రంగంలో వస్తున్న వినూత్న మార్పులకు అనుగుణంగా కొత్త ఔషధాలను సృష్టించటంలో అర్టిఫిషల్ ఇంటెలిజెన్స్ సహకారంతో తక్కువ ధరకు మందులను అందించవచ్చని చెప్పారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ బాలాజీ ఉట్ల, డీన్ వసుధ, కో కన్వీనర్ కృష్ణ ప్రసాద్, అధ్యాపకులు సయ్యద్, నవీన్, ఫరానా, మౌనిక, రాముడు, జబీన్ ఫాతిమ, విద్యార్థులు శ్రీజ, ధరణి, అఖిల తదితరులు పాల్గొన్నారు.




అనురాగ్ యూనివర్శిటీలో జరిగిన సదస్సులో మాట్లాడుతున్న కళాకుమార్ తదితరులు

# అధ్యాపకులు బోధనను మెరుగుపర్చుకోవాలి




డీఆర్‌డీవో అధికారి డాక్టర్ రాజేందర్‌ను సన్మానిస్తున్న అధ్యాపకులు

**మేడ్చల్,అక్టోబర్10:** అధ్యాపకులు విద్యా బోధనను మెరుగుపర్చుకోవాలని, ఇందుకోసం శిక్షణా కార్యక్రమాలను వినియోగించుకోవాలని గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడలోని మల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల మెయిన్ క్యాంపస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రామస్వామి రెడ్డి సూచించారు. కళాశాలలో మంగళవారం భారత సాంకేతిక విద్యా మండలి శిక్షణ, బోధనా పరిషత్(అటల్) ఆధ్వర్యంలో 'ఆధునాతన వీఎల్ఎస్ఐ పరిజ్ఞానంతో సాధికారిక రక్షణ వ్యవస్థ ఉపకరణములు' అన్న అంశంపై అధ్యాపక అభివృద్ధి(ఎఫ్‌డీపీ) కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానం కొత్త పుంతలు తొక్కుతున్న తరుణంలో అధ్యాపకులు నూతన పరిజ్ఞానంపై అవగాహన పెంచుకోవాలన్నారు. పరిజ్ఞానం పెంపునకు ఇలాంటి శిక్షణా కార్యక్రమాలను ఎంతో ఉపయోగపడుతాయన్నారు. ఆర్‌సీఐ, డీఆర్‌డీఎల్ వంటి ప్రతిష్టాత్మక రక్షణ రంగ పరిశోధనా కేంద్రాలతో పాటు డిజికామ్ సెమీకండక్టర్ వంటి బహుళ జాతీయ సంస్థలకు చెందిన నిపుణులు ఆరు రోజుల శిక్షణలో పాల్గొని వీఎల్ఎస్ఐ సాంకేతికత, డిజైన్ వినియోగంతో రాడార్ సంకేతాల విశ్లేషణ, సురక్షిత సమాచార ప్రసార వ్యవస్థ నిర్మాణం తదితర విషయాలను బోధిస్తారని చెప్పారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఈసీఈ హెచ్‌వోడీ డాక్టర్ ఏంజేసీ ప్రసాద్, డీఆర్‌డీవోకు చెందిన డాక్టర్ రాజేందర్, 50 మంది అధ్యాపకులు పాల్గొన్నారు.

# రాజకీయ పార్టీల ప్లెక్సీల తొలగింపు

**ఘట్‌కేసర్,అక్టోబర్10:** ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో ఘట్‌కేసర్,పోచారం మున్సిపాలిటీలలోని రాజకీయ పార్టీల ప్లెక్సీలను మున్సిపాలిటీ సిబ్బంది తొలగించారు.కాంగ్రెస్,బీఆర్ఎస్,బీజేపీ పార్టీలకు చెందిన చిన్న,భారీ ప్లెక్సీలు వరంగల్ రోడ్డులోని నారపల్లి,జోడిమెట్ల, అన్నోజిగూడ,ఘట్‌కేసర్,మైసమ్మ గుట్ట,ఘట్‌కేసర్ బస్టాండ్, పోచారం గ్రామం,తదితర ప్రాంతాలతో పాటు , బీజేపీ,కాంగ్రెస్,బీఆర్ఎస్ నాయకులు స్థానిక రోడ్లపై పెక్సీలను ఏర్పాటు చేశారు. ఎన్నికలకు సంబంధించిన కోడ్ అమలులోకి రావడంతో సిబ్బంది తొలగించి మున్సిపాలిటీ కార్యాలయాలకు తరలించారు.



పోచారం మున్సిపాలిటీలో పార్టీల ప్లెక్సీలను తొలగిస్తున్న సిబ్బంది

# అనాథ పిల్లలకు వైద్య సేవలు



వైద్య పరీక్షల కోసం చిన్నారుల పేర్లు నమోదు చేస్తున్న సిబ్బంది

**మేడ్చల్, అక్టోబర్ 10:** అనాథ పిల్లలకు గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ కండ్లకోయలోని సీఎంఆర్ మెడికల్ కళాశాల దవాఖానలో మంగళవారం ఉచితంగా వైద్య సేవలు అందించారు. నగరంలోని లేఖన చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రేమ చిల్డ్రన్స్ హోమ్‌లో ఆశ్రయం పొందుతున్న పిల్లలను వైద్యశాలకు తీసుకువచ్చి, వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులను పంపిణీ చేశారు. భోజన సౌకర్యాన్ని కల్పించారు. కార్యక్రమంలో వైద్యశాల డైరెక్టర్ డాక్టర్ అలీబేగ్,సీఈవో అభినవ్‌రెడ్డి, పీఆర్వో దుర్గా ప్రసాద్ రెడ్డి, ఎన్ఎస్ఎస్ పీవో సాహుల్ మోపిదేవి, డాక్టర్లు అనిల్, రాంచరన్, సంయుక్త, సౌజన్య, మార్కెటింగ్ టీం సభ్యులు మధు, రాజ్ నారాయణ, ప్రసాద్, దవాఖాన సిబ్బంది పాల్గొన్నారు.